మహేంద్రశర్మకు డాక్టరేట్


పి.మహేంద్రశర్మ

అత్తాపూర్: గణిత శాస్త్ర పరిశోధకుడు పోలకొండ మహేంద్రశర్మకు విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. కేఎల్‌యూ గణితశాస్త్ర విభాగం ఆచార్యులు డాక్టర్ కె.రాజ్యలక్ష్మి, జీఆర్ఐఈటీ ఆచార్యులు డాక్టర్ వి.ఎస్.రమాదేవిల పర్యవేక్షణలో తాను పరిశోధన పూర్తి చేశానని పి.మహేంద్రవర్మ తెలిపారు. అనాలసిస్ ఆఫ్ క్యూయింథ్ సిస్టమ్ విత్ టూ క్లాస్ అరైవల్స్, స్టేట్ డిపెండెంట్ సర్వీస్, కస్టమర్ ఇంపార్ట్‌మెంట్ అనే అంశంపై సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ లభించిందని తెలిపారు. ఈ మేరకు కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావ్ డాక్టరేట్‌ను ప్రకటించారని ఆయన వివరించారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం


షటిల్ పోటీలను ప్రారంభించిన సీతారాం

మణికొండ: విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించేందుకు తమ వంతు ప్రోత్సాహం అందిస్తామని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.సీతారాం అన్నారు. గురువారం ఆయన కాలనీలో అండర్-14 షటిల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏటా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు పలు క్రీడా పోటీలను నిర్వహించి... విజేతలకు 26వ తేదీన బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. ఔత్సాహిక క్రీడాకారులు పోటీలలో పాల్గొనాలని ఆయన కోరారు. షటిల్ టోర్నమెంట్‌లో మొత్తం 11 టీములు పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నాయకులు భీంరెడ్డి, జీబీకే రావు, రాధామనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దని వినతి

రాజేంద్రనగర్: శివరాంపల్లి సోహేబ్‌లో సెల్ టవర్‌ను ఏర్పాటు చేయవద్దంటూ కాలనీవాసులు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ... కాలనీలో కొత్తగా ఓ ఇంటిపై ప్రైవేటు సంస్థకు చెందిన సెల్ టవర్‌ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ సెల్‌ఫోన్ టవర్ కారణంగా ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతాయనే ఆందోళనతో తామంతా సెల్‌ఫోన్ టవర్‌కు వ్యతిరేకంగా ఉప కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించామన్నారు. జీహెచ్ఎంసీతో పాటు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు సెల్ టవర్ ఏర్పాటును నిలిపివేయాలని ఫిర్యాదు చేశామన్నారు. జీహెచ్ఎంసీ అనుమతులు వచ్చాయని తెలుపుతున్నారని వెంటనే రద్దు చేయాలని కోరామన్నారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేయనున్న ఇంటి వద్ద నిరసన వ్యక్తం చేస్తామన్నారు.

యాదవుల సంక్షేమానికి కృషి



రాజేంద్రనగర్: రాష్ట్రంలోని యాదవుల సంక్షేమం, అభ్యున్నతి కోసం కృషి చేస్తామని అఖిల భారత యాదవ సంఘం జాతీయ అధ్యక్షుడు చింతల రవి యాదవ్, జనరల్ సెక్రెటరీ ఆర్. లక్ష్మణ్ పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన వీరిని గురువారం కార్వాన్ కార్పొరేటర్ మండగిరి స్వామి యాదవ్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యాదవుల హక్కుల సాధనకు, రాజకీయపరంగా రిజర్వేషన్లు, యాదవ విద్యార్థులకు మెరుగైన విద్య కోసం యాదవులను ఏకతాటిపై నడిపించేందుకు కృషి చేస్తామన్నారు.

షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కృషి

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని కార్పొరేటర్ మహ్మద్ రాషేద్ ఫరాజుద్దీన్ అన్నారు. గురువారం ఆయన షేక్‌పేట్‌లో రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలు, కాలనీల్లో వీడీసీసీ రోడ్లు వేయించడం జరిగిందని అన్నారు. అదే విధంగా ఎగువ ప్రాంతాల్లో ఉన్న ఇళ్లకు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూస్తున్నానన్నారు. బుల్కాపూర్ నాలా కారణంగా దోమలు వృద్ధి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ, ఏఈ మోహన్‌రావు, బాలరాజ్, ముఖేష్, లక్ష్మణ్, చంద్రకుమార్ తదితరులున్నారు.

‘పశు సంక్రాంతి’కి సర్వం సిద్ధం

నేడు నార్సింగిలో పశువుల జాతర
- నిజాం కాలంలో మొదలైన పశువుల సంత
- ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్
- జాతరకు ఆవులు, గేదెలను తరలించిన రైతులు


నార్సింగి పశు సంక్రాంతికి అమ్మకానికి తరలివచ్చిన గేదెలు

మణికొండ: హైదరాబాద్ నగర శివారు నార్సింగిలో ఏటా సందడిగా జరిగే పశుసంక్రాంతి జాతరను శుక్రవారం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. నిజాం కాలంలో మొదలైన ఒరవడి నేటికీ నిరాటంకంగా కొనసాగుతున్నది. పంటలన్నీ ఇంటికి చేరి అవి అమ్మగా వచ్చిన డబ్బుతో రైతులు సంక్రాంతి పండగను ఘనంగా జరుపుకొంటారని అందరికీ తెలుసు. మిగిలిన డబ్బుతో తమ పంటలకు తోడుగా పాడిని (పశువులు) కొనుగోలు చేసే సంస్కృతికి చిహ్నంగా నిలిచేదే నార్సింగి పశుసంక్రాంతి. ఒకప్పుడు నార్సింగి కుగ్రామంగా ఉన్న సమయంలో ప్రారంభమైన ఈ సంస్కృతి ప్రస్తుతం మున్సిపాలిటీగా అవతరించి ఎటు చూసినా ఆకాశాన్నంటే టవర్‌లు, అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, కన్వెన్షన్‌లు, ఔటర్ రింగ్ రోడ్డుతో కొత్త హైటెక్ నగరంగా అవతరించినా కొనసాగుతుండటం అందరినీ అబ్బురపరుస్తుంది. ప్రతి సంవత్సరం సంక్రాంతి పండగ తరువాత వచ్చే రెండవ శుక్రవారం పశు సంక్రాంతిగా నిర్వహిస్తారు.



- గుజరాత్, హరియాణా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వేలాది గేదెలు, ఆవులను వ్యాపారులు, రైతులు ఇక్కడకు తెచ్చి క్రయవిక్రయాలను నిర్వహిస్తుంటారు.

దశాబ్దాలుగా కొనసాగుతున్న పశు సంక్రాంతిని ఈ సంవత్సరం శుక్రవారం నిర్వహించేందుకు మార్కెట్ కమిటీ పాలక కమిటీ ఏర్పాట్లు చేసింది.

- ప్రతి సంవత్సరం నార్సింగి పశు సంక్రాంతికి వచ్చే గేదెలు, ఆవులు రికార్డు ధరలు పలికి అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ఈసారి పంటలు బాగా పండటం, వరి పంట అధిక దిగుబడి రావటంతో రైతుల వద్ద డబ్బు ఉందని, పంటలకు తోడుగా పశువులను పెంచుకోవాలనే దిశగా రైతులు ఆలోచన చేస్తున్నారని, దాంతో శుక్రవారం జరిగే సంతలో భారీగానే అమ్మకాలు జరిగే అవకాశం ఉంటుందని పశు వ్యాపారులు పేర్కొన్నారు.


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్

ఏర్పాట్లను పరిశీలించిన చైర్మన్

నార్సింగిలో పశుసంక్రాంతికి వివిధ రాష్ట్రాల నుంచి ఇప్పటికే వందలాది గేదెలు, ఆవులు తరలివచ్చాయి. మరిన్ని దారిలో ఉన్నాయని, శుక్రవారం ఉదయం వరకు అవి ఇక్కడకు చేరుకుంటాయని మార్కెట్ కమిటీ వర్గాలు పేర్కొన్నాయి. వాటిని అమ్ముకునేందుకు వీలుగా మార్కెట్ కమిటీ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దటంతో పాటు టెంట్‌లను ఏర్పాటు చేశారు. పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్ గురువారం పర్యవేక్షించారు. పశుసంక్రాంతికి వచ్చిన గేదెలు, ఆవులను పరిశీలించి వాటి విశిష్టతలను వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు.

- పశుసంక్రాంతిని శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిలు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. మార్కెట్‌కు వచ్చే వ్యాపారులు, రైతులకు మొదటి సారి భోజనాలను ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా చైర్మన్ వెల్లడించారు.

ఘనంగా నేతాజీ జయంతి


హైదర్‌గూడలో నేతాజీకి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సంగీత తదితరులు

అత్తాపూర్: కుటిల రాజకీయాలకు బలైపోయిన అసలైన దేశ భక్తుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్ అన్నారు. నేతాజీ యూత్ అధ్యక్షుడు వెంకటేష్ ఆధ్వర్యంలో నేతాజీ జయంతిని గురువారం నిర్వహించారు. హైదర్‌గూడలోని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... నాకు రక్తాన్ని ఇవ్వండి మీకు స్వాతంత్ర్యం ఇస్తాను అని యువత నరనరాల్లో దేశభక్తిని నింపిన ధీశాలి సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. అలాంటి మహనీయులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నేతలు కొలన్ సుభాష్‌రెడ్డి, మేడం రామేశ్వర్‌రావు, మల్లారెడ్డి, కొముర‌య్య, ఎస్.శేఖర్‌రెడ్డి, నల్లింగ్ రమేష్, సి.హెచ్. చిన్న, జైఆనంద్‌రెడ్డి, కాడం సుధాకర్, వనం నర్సింహా, సోమారం రవీందర్, విజయ్‌కుమార్, కిరణ్, ముఖేష్, వెంకట్‌రెడ్డి, శశికాంత్, సుధాకర్, అయిలయ్య, రాజేందర్, శ్రీశైలం, గౌతమ్, హనుమంత్ రెడ్డి, భరత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


నేతాజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో...

నేతాజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో...

మైలార్‌దేవ్‌పల్లి: మహనేత నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని రాజేంద్రనగర్ సర్కిల్ నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి అన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు, తరతరాలకు తరగని స్ఫూర్తినిచ్చిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బుద్వేల్ నేతాజీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నేతాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి బిస్కెట్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి, సహాయ కార్యదర్శి కొంపల్లి జగదీష, గోంత్యాల శ్రీనివాస్, కిషోర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, ఉపాధ్యాయులు మమత, మహేశ్వర్, లక్ష్మి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విధాన నిర్ణయాల అమలులో ప్రజా పరిపాలనాశాస్త్రం కీలకం

రాయదుర్గం: ప్రజా పరిపాలనాశాస్త్రం ఏదైనా విధాన ప్రయత్నానికి ప్రధానమైందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్ఎం రహమతుల్లా పేర్కొన్నారు. మనూలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పాత్రపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధాన నిర్ణయాల అమలులో ఈ శాస్త్రం కీలకమన్నారు. కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రొఫెసర్ జి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మొత్తం 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ‘మనూ’ ఓఎస్డీ ప్రొఫెసర్ సిద్దిఖీ మహ్మద్ మాట్లాడుతూ స్వీయ పరిపాలన అవసరమన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ , విభాగాధిపతి ప్రొఫెసర్ సయ్యద్ నజీవుల్లా, సదస్సు కో కన్వీనర్ డాక్టర్ రజా ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ‘సండే ఈవినింగ్ టాక్ నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే కార్యక్రమంలో ‘హౌ టు ఎవైడ్ కన్సల్టింగ్ ఏ సైక్రియాటిస్ట్’ పేరిట మౌంట్‌అబూలోని గ్లోబల్ ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ డాక్టర్ నిఖిల్‌పటేల్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. వివరాలకు ఫోన్: 040 23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

కార్మికుల పక్షాన నిరంతర పోరాటం: సీఐటీయూ

మైలార్‌దేవ్‌పల్లి: పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరిస్తు వారి హక్కుల సాధనకై పోరాడుతున్నామని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, సాయిబాబాలు అన్నారు. రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ క్లస్టర్ పారిశ్రామిక ప్రాంతంలోని తిరుమల మెటల్ బాక్స్ పరిశ్రమలో పి.జగన్ కార్మికుడిగా పని చేస్తున్నాడన్నారు. ఈ నెల 22వ తేదీన మిషన్ దగ్గర పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కుడి చేతి బొటనవేలు విరిగిపోయిందన్నారు. గతంలో సైతం ఎడమచేతికి గాయాలయ్యాన్నారు. అయినా అదే పరిశ్రమలో పని చేస్తున్నాడనిన్నారు. కార్మికుడికి చికిత్స ఖర్చులతో పాటు పర్మనెంట్ ఉద్యోగిగా చేయాలని యాజమాన్యాన్ని కోరామన్నారు. దీనికి వారు సానుకూలంగా స్పందించి రాతపూర్వకంగా పత్రాన్ని ఇచ్చారన్నారు. కార్మికుడితో పాటు అతడి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. సీఐటీయూ నాయకులు వెంకటేష్, కార్మికుడి భార్య శ్వేత, కుమారుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.


గాయపడిన కార్మికుడి కుటుంబానికి హామీ పత్రాన్నిస్తున్న యాజమాన్యం

సీపీఎం మహాసభలను విజయవంతం చేయండి


కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

రాజేంద్రనగర్: సీపీఎం తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యుడు, రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్ర కుమార్ పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ సీపీఎం మండల కమిటీ సభ్యుడు ఎస్.జంగయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాసభలు ఈ నెల 25వ నుంచి 28వ తేదీ వరకు సంగారెడ్డి పట్టణంలో జరగనున్నాయన్నారు. మహాసభలను విజయవంతం చేసేందుకు పరిశ్రమల యజమానులు, బిజినెస్‌మాన్లు, ప్రజలు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు తోచిన ఆర్థిక సహకారం చేసి ప్రజా పోరాటాలకు సహకరించాలన్నారు. సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు ఎస్.రామ్మోహన్ రావు, జీఎం కురువయ్య, జీఎం గట్టయ్య, బచ్చల కూర స్వామి తదితరులు పాల్గొన్నారు.

చెస్‌లో సత్తాచాటుతున్న శివాంశిక

- పేదరికం వెంటాడుతున్నా ప్రతిభతో ముందుకు సాగుతున్న ఆణిముత్యం
- మంచి ఫలితాలు సాధిస్తున్న బాలికకు అభినందనల వెల్లువ



చెస్‌లో రాణించి ట్రోఫీ, బహుమతి సాధించిన శివాంశిక

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శివాంశిక చెస్ క్రీడలో సత్తాచాటుతూ ముందుకు సాగుతోంది. ఏపీలోని పెద్దాపూర్‌లో జనవరి 17 నుంచి 21వ వరకు జరిగిన అండర్-15 బాలిక నేషనల్ జాతీయ స్కూల్ చాంపియన్‌షిప్-2025లో తెలంగాణ రాష్ట్రం నుంచి శివాంశిక పాల్గొంది. వివిధ విభాగాలలో 2500 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, వెస్ట్ బెంగాల్, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల నుంచి చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. వారందరిలో అసాధ్యమైన ర్యాంకులు సాధిస్తూ తనదైన శైలిలో ఎవరు ఊహించని విధంగా ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ అంతర్జాతీయ చెస్ రంగంలో ఉన్న చెస్ క్రీడాకారుల ప్రశంసలు, ప్రోత్సాహాన్ని అందుకుంటోంది. పేదరికంలో ఉన్న శివాంశికకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహాన్నిస్తే దేశంలోనే అగ్ర స్థానానికి చేరుకుంటుందని.. మంచి కోచ్‌ను ఏర్పాటుచేస్తే ఉన్నత స్థానాలను తప్పక అధిరోహిస్తుందని మాస్త్రో చెస్ అకాడమీ అత్తాపూర్ ట్రైనర్ అమిత్ పాల్‌సింగ్ ఈ సందర్భంగా శివాంశికను అభినందించారు. నిర్వాహకురాలు చెస్ క్రీడల్లో రాణించిన శివాంషికను ఘనంగా సత్కరించి ట్రోఫీ, రూ. 5 వేల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. తమ పాఠశాలలో చదువుకుంటూ చెస్‌లో రాణిస్తున్న శివాంశిక తమ పాఠశాల విద్యార్థిని కావడం తమకు ఎంతో సంతోషంతోపాటు గర్వకారణంగా కలిగిస్తుందని రాజేంద్రనగర్ మండల విద్యా శాఖాధికారి (ఎంఈవో) శంకర్‌రాథోడ్, అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, ఉపాధ్యాయులు సాయిప్రసాద్, గాంగ్యానాయక్ తదితరులు అభినందించారు.

12, 13వ తేదీల్లో సమ్మక్క సారలమ్మ జాతర

ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు


గుట్టపై బండలకు రంగులు వేస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మానసా హిల్స్‌లోని సమ్మక్క సారలమ్మ గుట్ట జాతరకు ముస్తాబవుతోంది. ఫిబ్రవరి 12, 13వ తేదీల్లో ఎదురు పున్నమి సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహించనున్నారు. ఇందుకోసం అవసరమైన పనులను ప్రారంభించారు. సమ్మక్క సారలమ్మ గుట్టలకు రంగులు వేసి గద్దెలను వివిధ రంగులతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. గుట్టపైకి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరకు చుట్టు పరిసర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు తరలివస్తారు. జాతర నిర్వాహకులు నేరేడు శ్రీరాములు ముదిరాజ్, పూజారి నిరుడు చంద్రకుమార్ ముదిరాజ్‌లు భక్తులకు ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


వార్డు సభలో మేయర్, డిప్యూటీ మేయర్

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర అధ్యక్షతన వార్డు సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని... ఈ విషయంలో ఎటువంటి అనుమానాలు, ఆందోళనలు వద్దన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు లబ్ధిదారుల జాబితా తెలియజేశారు. కొత్త రేషన్ కార్డు, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు, ఇందిరమ్మ ఇల్లు రాని వాళ్లు ఈ సభలో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. సభలో కార్పొరేటర్లు సంతోషిరాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, పుష్ప శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాట్ ఒలంపియాడ్‌లో సత్తాచాటిన శ్రీచైతన్య విద్యార్థులు


మణకొండ విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

మైలార్‌దేవ్‌పల్లి: దేశవ్యాపంగా నిర్వహించిన క్యాట్ ఒలంపియాడ్ రెండవ లెవల్ పరీక్షల్లో శ్రీ చైతన్య విద్యార్థులు పాల్గొని ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపాల్ సుజాత సెబాస్టియన్ తెలిపారు. ఒలంపియాడ్ నిర్వాహకులు ఇటీవల 6వ నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా శ్రీ చైతన్య మైలార్‌దేవ్‌పల్లి విద్యార్థులు పాల్గొని క్యాష్ ప్రైజ్‌లు, మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్స్ సాధించారని వివరించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో డీన్ శ్రీనివాస్, ఒలంపియాడ్ ఇన్‌చార్జీ దుర్గారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్‌లో...

మణికొండ: నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్ (కేఏటీ) లెవల్-2లో మణకొండ శ్రీ చైతన్య విద్యార్థులు సత్తాచాటారు. ఇందులో పాల్గొన్న 51 మంది విద్యార్థులు మెడల్, పతకాలు, ప్రశంసా పత్రాలను అందుకున్నారని ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. ఎనిమిది మంది విద్యార్థులు రూ. వెయ్యి చొప్పున నగదు పురస్కారం, మెడల్, మెరిట్ పత్రాలను పొందారన్నారు. 22 మంది విద్యార్థులు మెడల్, మెరిట్ పత్రాలను దక్కించుకున్నారన్నారు. మరో 21 మంది విద్యార్థులు మెరిట్ పత్రాలను పొందారని ఆమె వివరించారు. విద్యార్థులను ఆమెతో పాటు వైస్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి
- మణికొండ, నార్సింగి మున్సిపల్ చైర్మన్‌లు


పుప్పాలగూడ వార్డుల సభలో మాట్లాడుతున్న చైర్మన్ నరేందర్ ముదిరాజ్

మణికొండ: రాష్ట్రంలో పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసి వారికి అవసరమైన అన్ని రకాల పథకాలను అందిస్తున్నదని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ ఎం.నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడలో 10, 11, 12, 17, 18వ వార్డుల సభలో చైర్మన్ పాల్గొన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ 12వ వార్డు సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనాదిగా పేదల పక్షపాతిగా కాంగ్రెస్ పార్టీ నిలిచిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు రైతు రుణమాఫీ, ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్ లాంటి పథకాలను అందిస్తుందన్నారు. ఈ నెల 26వ తేదీ నుంచి రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నదన్నారు. మిగిలిన పథకాలను రాబోయే రోజుల్లో దశల వారిగా అందించేందుకు కృషి జరుగుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పులు ఎక్కువ సంక్షేమ పథకాలు తక్కువగా ఇచ్చారన్నారు. అందుకు అనుగుణంగానే ప్రజలకు కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. గౌలిదొడ్డి వార్డు సభలో కౌన్సిలర్ డి.రేఖయాదగిరి, నార్సింగి 6, 8వ వార్డుల సభలో కౌన్సిలర్‌లు పత్తి ప్రవీణ్‌కుమార్, పత్తి శ్రీకాంత్‌రావులు పాల్గొని ప్రజల నుంచి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ గృహాలకు దరఖాస్తులు తీసుకున్నారు. ఆయా సభలలో మున్సిపల్ కమిషనర్‌లు డి.ప్రదీప్‌కుమార్, టి.కృష్ణమోహన్‌రెడ్డి, టీపీఓలు సంతోష్‌సింగ్, మణిహారిక, మేనేజర్‌లు యోగేష్, శ్రీధర్‌లతో పాటు కౌన్సిలర్‌లు, ప్రజలు పాల్గొన్నారు.


ఖానాపూర్ వార్డు సభలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్


నార్సింగిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కౌన్సిలర్‌లు